# రత్తాలు

**-దూశి గురునాధరావు**

ఉదయాన్నే ఇంటిముందు లాన్‌లో ఛెయిర్‌లో కూచుని పేపరు చదువుతున్నాను. మా ఆవిడ సత్య కాఫీ కప్పుతో వచ్చి కాఫీ అందించింది.

"నీ కాఫీ ఏది?" అడిగాను. ఎందుకంటే ఉదయం ఇద్దరం లాన్‌లో కూర్చుని కాఫీ త్రాగడం అలవాటు.

"పని మనిషి లేదుగా. వంటిల్లు చక్కబెట్టివచ్చి కాఫీ తాగుతాను" అంది మా ఆవిడ.

"తరవాత చక్కబెడుదువుగానిలే. ముందు కాఫీ నీకు కూడా తెచ్చుకో. నువ్వు వచ్చాకే కాఫీ తాగడం" అన్నాను. తను కాఫీ తెచ్చుకోడానికి లోనికి వెళ్ళింది.

ఈ సంవత్సరంలో నలుగురు పని మనుషులు మారారు. ఒక పని మనిషి పని వచ్చుక మా ఆవిడే ఆమెను మాన్పించింది. ఇంకో పని మనిషి ఎర్రగా బుర్రగా ఉండి మేకప్ చేసుకుని వచ్చేది. మా ఇద్దరు అబ్బాయిల ముందు హొయలు ఒలకబోసేది. నేను కూడా మంచి ఒడ్డుపొడుగుతో చూడడానికి బాగానే ఉంటాను. నన్ను కూడా చూసి వంకరలు బోయేది ఆ పని మనిషి. ఇవన్నీ చూసి మా ఆవిడకు ఒళ్ళు మండి ఆమెను మాన్పించింది.

ఇంకో పనిమనిషి చాలారోజులు చక్కగా పని చేసింది. ఒకరోజు సడెన్‌గా చెప్పింది వాళ్లాయనకు గుజరాత్‌లో ఏదో పని దొరికిందిట. అందుకు పెట్టే బేడా సర్దుకుని కుటుంబం అంతా గుజరాత్ వెళ్తారట. తనకు రావాల్సిన డబ్బులు తీసుకుని పని మానేసింది. ఇక ఆ తరువాత వచ్చిన పనిమనిషి ఆదివారం సెలవు తీసుకోవడమే కాకుండా వారంలో కనీసం రెండురోజులు పనికి వచ్చేదికాదు. అందుకు ఆమె చెప్పిన కారణాలన్నీ అబద్ధాలే అంటుంది మా ఆవిడ.

మా ఆవిడా, నేనూ కాఫీ త్రాగడం పూర్తి చేసాక మా ఆవిడను అడిగాను.

"ఇంకా కొత్త పనిమనిషి కుదరలేదా?"

"లేదండీ. పక్కింటి పిన్నిగారికి, మహిళా మండలిలో మా స్నేహితురాళ్లకి చెప్పి వుంచాను. ఈ రోజు బహుశా పిన్నిగారు పంపిన పనిమనిషి రావచ్చు" అంది మా ఆవిడ.

ఇంట్లో అన్ని పనులు ఒంటిచేత్తో టకటకలాడించి తొందరగా పూర్తి చేస్తారు పనిమనుషులు. అదే పనిని ఇంట్లోవాళ్లు చేయడానికి ఆపసోపాలు పడిపోతుంటారు విచిత్రంగా.

***

ఉదయం ఎనిమిన్నర గంటల టైములో గేటు చప్పుడయితే అటు చూసాను. గూర్ఖాతో ఎవరో ఇరవై ఏళ్లు పైబడిన అమ్మాయి మాట్లాడుతోంది. తరువాత గూర్ఖా లోపలకివచ్చి చెప్పాడు పక్కింటి పిన్నిగారు పంపిన పనిమనిషి వచ్చిందని. ఇంతలో మా ఆవిడ వచ్చి ఆ అమ్మాయిని లోపలికి పంపమని గూర్ఖాతో చెప్పింది.

ఆమె పేరు రత్తాలు. మరీ అంత నలుపుగాదు గానీ నలుపే. పల్లెటూరి చీరకట్టు. మొహం జిడ్డోడుతూ ఉంది. కళ్లల్లో జీవంలేదు. ఈసురోమంటూ వుంది. కాళ్లకు పాత హవాయి చెప్పులు.నేను టై కట్టుకుంటూనే మా ఆవిడకు, రత్తాలుకు జరుగుతున్న సంభాషణ వింటున్నాను.

"ఎక్కడ ఉంటున్నావు?" అడిగింది మా ఆవిడ.

"ఈ ఊరిలోనే. ఊరవతల ఉంటున్నానమ్మా" రత్తాలు ముఖం దించుకునే సమాధానం ఇచ్చింది.

"నువ్వు చేయవలసిన పనులు చెప్తున్నాను విను. అంట్లు తోమాలి, వంటింట్లో గట్టు, పొయ్యి క్లీన్ చేయాలి. ఇల్లంతా తుడిచి డెట్టాల్ వేసి తుడవాలి. ఇంట్లో నేను, మా ఆయన, ఇద్దరు పిల్లలు. పిల్లలంటే చిన్న పిల్లలు కాదు. ఇద్దరూ లక్షణంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వింటున్నావా? మా అందరి బట్టలు ఉతకాలి"

"సరేనమ్మా"

"ఇంతకీ ఏం తీసుకుంటావో చెప్పు"

"వెయ్యి రూపాయలమ్మా"

"వెయ్యి రూపాయలా?" రత్తాలు అన్న మాటలకు ఆశ్చర్యపోయింది మా ఆవిడ.

"చుట్టుపక్కల ఇళ్లల్లో ఇంకా తక్కువకే ఈ పనులన్నీ చేస్తున్నావుకదా?" అడిగింది మా ఆవిడ.

"మీ ఇల్లు బంగళా కదమ్మా. అన్ని గదులు, హాలు, వంటిల్లు... బండెడు చాకిరీ చేయాలి" అంది రత్తాలు.

"సరే అయితే. ఎప్పటినుండి పనిలోకి వస్తావు?"

హమ్మయ్య... కొత్త పనిమనిషి కుదిరింది. అయితే ఈమె ఎన్నాళ్లు ఉంటుందా అని నేను అనుకుంటూ ఉండగానే రత్తాలు మాటలు చెవిన పడ్డాయి.

"అమ్మగారూ! నావి కూడా కొన్ని షరతులున్నాయి. మీరు వాటిని ఒప్పుకుంటేనే పనిలో చేరతాను" అంది రత్తాలు.

"నీకు కూడా షరతులా? సరే ఏంటో చెప్పు" అంది మా ఆవిడ.

"రోజూ ఉదయాన్నే వచ్చి పనులున్నీ చేస్తానుగానీ రెండోపూటరాను. రోజూ ఇల్లు ఊడ్చి తుడుస్తాను. కానీ బట్టలు ఉతకడం మాత్రం వారానికి రెండుసార్లు చేస్తాను. నాకు మిషన్ మీద పనిచేయడం కూడా వచ్చు. వాషింగ్ మిషన్‌లో అయితే రోజు విడిచి రోజు బట్టలు ఉతికి ఆరేస్తాను" రత్తాలు వల్లించే షరతులను మా ఆవిడ నోరెళ్లబెట్టి వింటోంది.

"ఆదివారం మాత్రం నాకు సెలవు ఇవ్వాలి. మామూలుగా అయితే రోజూ వస్తానుగానీ ఏదైన అవసరం అయి రాలేకపోతే మీకు కబురు పంపుతాను'' కొంచెంసేపు ఆగింది రత్తాలు.


మా ఆవిడకు ఈ షరతుల నచ్చలేదు కాబోలు... "ఇంతేనా? ఇంకేమైనా ఉన్నాయా?'' అని హేళనగా అంది.

"ఉన్నాయమ్మా. మీ మిగిలిపోయిన అన్నాలు, కూరలు పట్టుకుని వెళ్లమనకండి. మీ పాత బట్టలు మాకు వద్దు. నాకేమైనా సహాయం చేయాలనిపిస్తే డబ్బివ్వండి. మీరిచ్చే జీతంతో ఇల్లు గడవడం కష్టం. అందుకే డబ్బిస్తే పనికి వస్తుంది'' అంది రత్తాలు.గ్యారంటీగా రత్తాలు పెట్టిన ఇలాంటి షరతులకు మా ఆవిడ ఒప్పుకోదనుకున్నాను. అయితే రత్తాలు షరతులన్నింటికీ ఒప్పుకుంది. వెంటనే పనిలో చేరమని రత్తాలుకు చెప్పింది. ఏమైనా అడ్వాన్స్ కావాలా అని కూడా అడిగింది.

అడ్వాన్స్ ఏమీ అక్కరలేదనీ, రేపటినుండి పనిలోకి వస్తానని చెప్పి వెళ్లిపోయింది రత్తాలు.

"అసలే పనిమనుషులు దొరకడంలేదు. ఇంటెడు చాకిరీ చేయలేక చస్తున్నాను. అందుకే ఆమె షరతులకు ఒప్పేసుకున్నాను'' అని తనలో తాను అనుకుంటున్నట్లుగాను, నాతో చెప్తున్నట్లుగానూ సణుగుతూ ఇంట్లోకి వెళ్లిపోయింది. మా ఆవిడ నాకు చెప్పలేదుగానీ తను ఒప్పుకోవడానికి బలీయమైన కారణం రత్తాలు రూపురేఖలు. ఇంట్లో జెమాజెట్టీల్లాంటి ముగ్గురు అందమైన మొగవాళ్లున్నారు. అందమైన పనిమనిషిని పెట్టుకుని మా ఆవిడ కుదురుగా కూర్చోగలదా? నాచేతయితే శోభనం గదిలోనే ఒట్టు పెట్టించుకుంది నేను ఇతర ఆడవాళ్ల వెంటపడనని. ఎందుకంటే నా పేరు మురళీకృష్ణ. పేరుకు తగ్గట్టుగానే చిలకకొట్టుళ్లు కొడుతుంటానని ఎవరో ఆమెకు ఉప్పందించారు.

★★★




రత్తాలు మంచి ఒడుపుతో ఇంటి పనులన్నీ చకచకా చేస్తోంది. ఇల్లంతా సర్ది అద్దంలా నీట్‌గా ఉంచడానికి మా ఆవిడకు సాయపడుతోంది. రత్తాలు ఎప్పుడూ పనికి ఎగనామాలు పెట్టలేదు. ఇది కావాలి అది కావాలి అని అడగలేదు. తన కుటుంబం గురించి కూడా చెప్పలేదు. మా ఇంట్లో పని చేస్తుంటే ఏదో ఆనందం ఆమె ముఖంలో కనిపించేది. రెండు నెలల్లో కొంచెం కండపట్టి మనిషి తేరుకుంది. రత్తాలు అంటే మా ఆవిడకు గురి కుదిరింది. మా ఇద్దరబ్బాయిలలో పెద్దవాడు రాధాకాంత్. నేను చేస్తున్న కంపెనీలోనే ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. రెండోవాడు శ్రీకాంత్. ఎమ్‌బిఏ చేసాడు. ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరూ ఉద్యోగాల్లో సెటిలయ్యారు కనుక ఇద్దరికీ పెళ్లి సంబంధాలు వెతకడం ప్రారంభించాము.

***



## కష్టానికి గుర్తింపు

'దిల్ బోలే హడిప్పా' సినిమా తన కెరీర్‌ని బ్రహ్మాండమైన మలుపు తిప్పుతుందని ఎంతగానో ఆశించింది రాణీ ముఖర్జీ. ఎందుకంటే ఈమధ్య తనకి ఒక్కటంటే ఒక్క హిట్టు కూడా లేదు. కానీ ఆమె ఆశల్ని అడియాలు చేస్తూ ఆ సినిమా ఫ్లాప్ అయింది. దాంతో నిరాశలో మునిగిన ఆమెకి ఉత్సాహం కలిగించేలా ఆ సినిమాలో నటనకు గాను 'వి.శాంతారామ్ ఉత్తమ నటి' అవార్డును ఆమెకి ఇచ్చారు నిర్వాహకులు. ఏదైతేనేం తన కష్టానికి ఇలాగైనా గుర్తింపు లభించిందని తెగ సంబరపడుతోందిట రాణి.




ఒకరోజు సాయంత్రం మా రెండో అబ్బాయి శ్రీకాంత్ ఒకమ్మాయిని తనతో ఇంటికి తీసుకువచ్చి మాకు పరిచయం చేసాడు.

"ఈమె పేరు ప్రసన్న. మా కంపెనీలోనే క్లర్క్‌గా పని చేస్తోంది. కంప్యూటర్ నాలెడ్జి బాగా ఉండడంవల్ల మంచి ఇంక్రిమెంట్లతో జాబ్‌లో చేరింది."

శ్రీకాంత్ చెప్తున్నాడు. వింటూ ప్రసన్నవైపుచూసాము. మనిషి చుడీదార్‌లో చూడముచ్చటగా ఉంది. పాలుగారుతున్న బుగ్గలు, చురుకైన కళ్లు, ముఖం కళగా ఉంది.

"అమ్మా! నేను ప్రసన్న ప్రేమించుకున్నాము. పెళ్లి కూడా చేసుకుందామనుకుంటున్నాము. మీ అనుమతి కావాలి" అన్నాడు శ్రీకాంత్.

నేను, సత్య మౌనంగా ఉన్నాము.

"ప్రసన్నకు అక్క తప్పించి నా అన్నవాళ్లులేరు. ఆమె తండ్రి, నాన్నగారికి బాగా తెలుసు" అని ఓ క్షణం ఆగాడు.

"ప్రసన్న నాన్నగారు నాకు తెలుసా? ఏమిట్రా నువ్వు అంటున్నావు?" అన్నాను. సమాధానంగా ప్రసన్న అంది.

"మా నాన్నగారు శంకర్ మీ దగ్గర కారు డ్రైవర్‌గా పని చేసాడు" అంది.

వెంటనే నాకు ఫ్లాష్‌బ్యాక్‌లో శంకర్ కనిపించాడు. శంకర్ నా కారు డ్రైవర్‌గా ఉండేవాడు. రెండుసార్లు నా ప్రాణాలు కాపాడాడు. ఒకసారి మా కంపెనీలో సమ్మె చేస్తున్న కార్మికులు నామీద తిరగబడి కొట్టడంతో చాలా రక్తం పోయింది. శంకర్ చాకచక్యంగా నన్ను వాళ్ల నుండి తప్పించి కారులో హాస్పిటల్‌కు తీసుకుపోయి చికిత్స ఏర్పాట్లు చేయించాడు. అర్జంటుగా రక్తం అవసరం అయితే తన రక్తమిచ్చి నాప్రాణాలు కాపాడాడు. ఇంకోసారి నిలుచున్న మా కారును వెనుక నుండి ఒక ట్రక్కు వచ్చి గుద్దింది. కారులో వెనుక కూర్చున్న నాకు ఎముకలన్నీ చిట్లిపోయాయి. రక్తం కూడా చాలా పోయింది. కానీ శంకర్ ప్రమాదం నుండి బయటపడ్డాడు. త్రోవలో పోతున్న ఇంకో కారులో నన్ను వెంటనే హాస్పిటల్‌లో చేర్పించి తన రక్తమిచ్చి నాకు ప్రాణదానం చేసాడు.

అటువంటి శంకర్‌ను నేనెలా మరచిపోగలను. అయితే అతనికి త్రాగుడు అలవాటు ఉండేది. రాత్రిపూట పూర్తిగా తాగి పెళ్లాం పిల్లలను చావబాదేవాడట. ఆ బాధతోనే అతని భార్య చనిపోయింది. అతను కూడా తన ఇద్దరు ఆడపిల్లల బాధ చూడలేక తాగుడు ఎక్కువ చేసాడు. డ్యూటీకి రావడం తగ్గించేసాడు. ఒకరోజున కల్తీ సారా తాగడంవల్ల చనిపోయాడని తెలిసింది. పిల్లలను అనాధాశ్రమంలో చేర్పించాం. కంపెనీ అనాధాశ్రమానికి ప్రతి సంవత్సరం కొంత డబ్బు డొనేట్ చేస్తూ వస్తోంది.

"ప్రసన్నా! మీరు ఇద్దరు అక్కచెల్లెళ్లుకదా. మీ అక్క ఏం చేస్తోంది?" అని అడిగాను.

"మా అక్క పిల్లల గార్మెంట్స్ షాపులో పని చేస్తోంది" అంది ప్రసన్న.

ఇంతవరకూ మౌనంగా ఉన్న మా ఆవిడ శ్రీకాంత్‌తో అంది.

"నీకు వయసు వచ్చింది. మంచిచెడూ బేరీజు వేసుకోగలవు. పిల్ల బాగుంది. ఆమెకు ఆస్తి ఐశ్వర్యం లేవని మాకు చింతలేదు. అవి మనకు ఉన్నాయిగా. అయినా నీ పెళ్లికి ముందు అన్నయ్య పెళ్లి కుదరాలి కదా. మాకు కొంచెం టైమ్ ఇవ్వు. మా ఉద్దేశ్యం రెండురోజుల్లో చెప్తాం" అంటూ నావైపు చూసింది. ఆమె మాటలతో ఏకీభవిస్తున్నట్లు తలాడించాను. ప్రసన్నను తీసుకుని శ్రీకాంత్ బయటకు వెళ్లిపోయాడు. వారు వెళ్లిన వైపు చూస్తూ మా ఆవిడతో అన్నాను.

"శంకర్ నా ప్రాణదాత. అదీ రెండుసార్లు నా ప్రాణాలు కాపాడాడు. నేనంటే అతనికి అభిమానం ఎక్కువ. అది నీకు కూడా తెలుసుకదా"

"అవునండీ. మన ఇంటి మనిషిలా మెలిగేవాడు. పాపం చివరకు పిల్లలను అనాధలను చేసి వెళ్లిపోయాడు" అంది సత్య.

"ప్రసన్నను మన కోడలుగా అంగీకరిస్తే ఒక విధంగా అతని ఋణం తీర్చుకున్నవాళ్లమవుతామేమో అనిపిస్తోంది. ఏమంటావు?'' అన్నాను.

"నిజమేగానీ మనవాడికేం తక్కువ? ఎవరో అనాధను...'' అని సత్య అంటుండగానే మధ్యలో కలగజేసుకుని అన్నాను.

"ఆ పిల్ల మనింటికి వచ్చాక అనాథ కాదు కదా. అయినా ఈ రోజుల్లో పిల్ల గుణగణాలు ముఖ్యంగానీ ఆమె పుట్టుపూర్వోత్తరాలు, కులగోత్రాలు ముఖ్యమా? పైగా మన శ్రీకాంత్ ఇష్టపడ్డాడు'' అన్నాను.

"మరి మన పెద్దవాడికి పెళ్లి కాకుండా ఎలా?''

"సరేలే... ఈలోగా వాడికీ ఏదో సంబంధం కుదరకపోదు. నేనలా బజారువైపు వెళ్లివస్తాను'' అని వీధిలోకి వచ్చాను.

వెంటనే సెల్‌లో శ్రీకాంత్ కంపెనీ రిసెప్షనిస్టు నెంబర్ వెదికి ఫోన్ చేసి ప్రసన్న వివరాలు, అడ్రస్ కనుక్కున్నాను.

ప్రసన్న ఒక పూరి గుడిసెలో వుంటోంది. తను ఇంట్లోనే వుంది. శ్రీకాంత్ ఆమెను ఇంటివద్ద దింపి వెళ్లి వుంటాడు. వీధిలో గేటువద్ద నన్ను చూసి లోపలకు ఆహ్వానించింది ప్రసన్న. పైన కనబడుతోంది పూరి గుడిసే. కానీ లోపల అందంగా అన్నీ పొందిగ్గా సర్ది ఉన్నాయి. లోపల ఒక చిన్నహాలు, చిన్న గది, వంటిల్లు. వెనకవైపు చిన్న పెరడు, దానిలో బాత్రూమ్. వీధిలోని పెరట్లోని ఉన్న జాగాలో చక్కటి పూలమొక్కలు ఉన్నాయి. హాలులో కుర్చీలు వేసి ఉన్నాయి. గదిలో ఒక స్టీలు బీరువా, రెండు సింగిల్ కాట్‌లు ఉన్నాయి. లోపల చీకటిని పారద్రోలుతూ విద్యుద్దీపాలు ఉన్నాయి. ప్రసన్న మంచి నీరు అందించింది. ఇంతలో వీధి గేటు చప్పుడయింది.

"మా అక్క వచ్చినట్లుంది. కూర్చోండి ఇప్పుడే వస్తాను'' అంటూ ప్రసన్న బయటకువెళ్లి ఒకామెను వెంటబెట్టుకుని వచ్చింది.

"ఈమె మా అక్క. పేరు రత్నం'' అంది ప్రసన్న.

ఆమెను చూసి నేను అవాక్కయ్యాను. ఆమె మా ఇంట్లో పని చేసే రత్తాలే. నన్ను చూసి రత్తాలు కూడా బిత్తరపోయింది.

"ఏమిటి ఈమె మీ అక్కా? పిల్లల గార్మెంట్స్‌లో పని చేస్తోందన్నావే?'' అని ప్రసన్నను అడిగాను. దానికి రత్తాలే సమాధానం ఇచ్చింది.

"క్షమించండి సార్. ఉదయం పదివరకు ఇళ్లల్లో పాచి పని చేసిన తరువాత ఆ షాపుకు వెళతాను. ఇలా చేస్తూనే మా చెల్లెలిని చదివించాను. నేను మాత్రం చదువుకోలేకపోయాను'' అంది రత్తాలు.

"చెల్లీ కాఫీ చేయి. నేనేలోగా బట్టలు మార్చుకుని వస్తాను'' అంటూ రత్తాలు నావైపు చూసి "మీరు కూర్చోండి. రెండు నిముషాల్లో వస్తాను'' అంటూ గదిలోకి, గదిలోంచి వంటింట్లోకి వచ్చి పెరట్లోకి వెళ్లింది.

ఈలోగా ప్రసన్న కాఫీ కలిపి తెచ్చింది. కాఫీ త్రాగుతుండగా గదిలోంచి వచ్చింది రత్తాలు కాదు రత్నం అనబడే రత్తాలు.

ఆమెను చూసాక నా ఆశ్చర్యానికి అవధులులేవు. ఎందుకంటే ఆమె అపరంజి బొమ్మలా వుంది. మంచి దేహచ్ఛాయ, పెద్దకళ్లు, తీర్చిదిద్దిన ముక్కు, నుదుటిపై పడుతున్న ముంగురులు, లేత గులాబీరంగు చీరలో చక్కగా ముత్యంలా ఉంది. నా నోట మాట రాలేదు.

కళ్లతోనే ప్రశ్నించాను ఏమిటి ఇదంతా? అని.

"సార్! నేను పెద్దదాన్నయ్యాక అనాధాశ్రమంలో ఇమడలేక చెల్లెలితో బయటకు వచ్చేసాను. మా దూరపు బంధువు ఒకతను మామీద జాలితో తన పూరి గుడిసెలో ఉండమన్నాడు. అయితే నా అందమే నాకు శత్రువయింది. చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ వెంటపడేవారే. బస్సులో కూడా చాలా ఇబ్బంది పడేదాన్ని. మాకు ఎవరూ అండగా లేరు. ఆత్మహత్యే శరణ్యమని ఒకప్పుడు అనిపించింది. అయినా తెగించి తోడేళ్లను, రాబందులను ఎదుర్కోవడానికే సిద్ధపడ్డాను. ఇంతలో నాకీ ఐడియా వచ్చింది. నన్ను నేను కురూపిగా చేసుకుంటే క్రూరమృగాలు నా వెంట పడవని అనిపించి రోజూ ఇలాగే వేషం మార్చుకుని బయట తిరుగుతున్నాను'' అని ఒక క్షణం ఆగింది రత్నం.


"మీ నాన్న నావద్ద డ్రైవర్‌గా పని చేసాడని నీకు తెలుసా?''

"ఈమధ్యనే మా చెల్లిద్వారా తెలిసింది. ఇంక మీ ఇంట్లో పని మానేద్దామనుకుంటున్నాను. నన్ను క్షమించండి'' అంది రత్నం.

"సరే ఆ సంగతి తరువాత ఆలోచిద్దాం. ముందు నువ్వు, మీ చెల్లి రేపు మా ఇంటికి రండి. రేపు మా పనిమనిషికి సెలవు ఇచ్చేయి'' అన్నాను.

నేను బయటకు వచ్చాక అక్కాచెల్లెల్లిద్దరూ నా కారు వరకు వచ్చారు. రేపు కలుద్దాం అని చెప్పి కారు స్టార్టు చేసాను. అప్పుడే నాలో ఒక స్థిరమైన అభిప్రాయం ఏర్పడింది... మా పెద్దవాడు రాధాకాంత్‌కు రత్నం సరైన జోడి అని.

★



## మంచులేని కిలిమంజారో

ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వత శిఖరం ఆ ఖండంలోనే చాలా ఎత్తైనది. 1912 వరకు మంచుతో కప్పబడివుండేదట. ఇటీవల భూగోళ వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన ఉష్ణోగ్రత మార్పులవల్ల 85 శాతం మంచు పూర్తిగా కరిగిపోయింది. పరిస్థితులు ఇలాగే ఉంటే వచ్చే 20 ఏళ్ళల్లో ఆ శిఖరంపై మంచన్నదే లేకుండా పోతుందిట.

-తటవర్తి

